

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY


ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 06-09-2026 సంపుటి : 08 సంచిక 79 పేజీలు : 8 వెల : రూ 3-00


# ఉద్యోగులకు శుభవార్త..



## పీఆర్సీ కమిషన్ ఏర్పాటుకు ఏపీ ప్రభుత్వం అంగీకారం

అమరావతి, సెప్టెంబర్ 5 : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో ఉన్నత స్థాయి సమావేశం రాష్ట్ర సచివాలయంలో జరిగింది. ఈ భేటీలో ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై సీఎం పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో ఉద్యోగ సంఘాలతో సానుకూలంగా చర్చలు జరిగాయి.అక్టోబర్ 1వ తేదీ నుంచి రెండు డీఏల చెల్లింపునకు ఏపీ సర్కార్ అంగీకరించింది. సరెండర్ లీవులను జనవరిలో వేసేందుకు ఆమోదించింది. పీఆర్సీ కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం అంగీకరించింది. అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ రిస్టోరేషన్‌కు కూటమి సర్కార్ ఆమోదం తెలిపింది. సీఎం ప్రకటనపై ఉద్యోగ సంఘాల నాయకులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఉద్యోగులు ప్రభుత్వంలో భాగమని.. వారికి సాధ్యమైనంత అండగా నిలుస్తామని సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు. అనంతరం ఉద్యోగ సంఘాల నేతలతో చర్చించిన నిర్ణయాలను ముఖ్యమంత్రి వెలువరించారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న నిర్ణయాలివే..

12వ పీఆర్సీ నియామకానికి అంగీకారం.

రెండు డీఏలు 2026 అక్టోబర్ 1వ తేదీ నుంచి చెల్లింపు.

1-7-2024 నుంచి 1-1-2025 డీఏల విడుదల

2022 సంవత్సరానికి సంబంధించి సరెండర్ లీవ్స్‌ను వచ్చే సంక్రాంతికి అకౌంట్‌లో వేయడానికి ఏపీ ప్రభుత్వం అంగీకారం.

పోలీసులకు ఒక అడిషనల్ సరెండర్ లీవ్ ఈ దసరాకి చెల్లింపు.

అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ జనవరి- 2027 నుంచి ఇచ్చేందుకు నిర్ణయం.

70 ఏళ్లు దాటిన వారికి 10 శాతం, 75 ఏళ్లు దాటిన వారికి 15 శాతం మేర అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ వర్తింపు.

ఎంప్లాయిస్ హెల్త్ స్కీంను స్ట్రీమ్ లైన్ చేసేందుకు ఆమోదం.

వచ్చే నెల నుంచే ఏ నెలకు ఆ నెల ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌కు చెల్లింపునకు కూటమి సర్కార్ అంగీకారం.

ఈ నిర్ణయాల కారణంగా ప్రతి ఏడాది రూ.2880 కోట్లను ఖర్చు చేయడానికి ఏపీ ప్రభుత్వం అంగీకరించింది.పీఆర్సీ చైర్మన్‌ను నియమించాలని సీఎం నిర్ణయం తీసుకున్నారు: రామకృష్ణసీఎం చంద్రబాబు అధ్యక్షతన ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో ఉన్నత స్థాయి సమావేశం జరిగిందని ఆంధ్రప్రదేశ్ సచివాలయ సంఘం అధ్యక్షుడు ఒ కార్యవర్గం జి. రామకృష్ణ తెలిపారు. ఈ సమావేశం అత్యంత సానుకూల వాతావరణంలో జరిగిందని వెల్లడించారు. ఏపీ సచివాలయ సంఘం తరపున సచివాలయ ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించి ఇళ్ల స్థలాల కేటాయింపు, ఖఖీఅ చైర్మన్ నియామకం, నూతన ప్రభుత్వ భవనాల సముదాయంలో రాష్ట్ర సచివాలయానికి ప్రత్యేక టవర్ కేటాయింపు, పెండింగ్ బిల్లుల చెల్లింపు, ఇఊూ క్రమబద్ధీకరణ, సీసీఎస్‌కి ఆమోదయోగ్య శాశ్వత పరిష్కారం వంటి పలు కీలక అంశాలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకుందని చెప్పారు. వేతన సవరణను వేగవంతం చేసేందుకు వెంటనే పీఆర్సీ (ఖఖీఅ) చైర్మన్‌ను నియమించాలని సీఎం నిర్ణయం తీసుకున్నారని రామకృష్ణ పేర్కొన్నారు.ఐఆర్‌పై త్వరలో నిర్ణయం తీసుకుంటామని సీఎం చెప్పారని రామకృష్ణ అన్నారు. రాష్ట్ర సచివాలయ ఉద్యోగులకు ఇళ్ల స్థలాల అంశాన్ని త్వరితగతిన పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని అన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని తెలిపారు. దశల వారీగా పలు సమస్యలు పరిష్కరిస్తామని సీఎం చెప్పారని అన్నారు. తమ ప్రభుత్వానికి ఉద్యోగులు సహకరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారని తెలిపారు. ఈ ప్రభుత్వానికి ఆర్థికంగా ఎన్నో సమస్యలు ఉన్నప్పటికీ, ఉద్యోగుల పక్షపాతిగా నిలిచి, తక్షణ నిర్ణయాలు తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకి ఉద్యోగుల తరపున ధన్యవాదాలు తెలుపుతున్నామని రామకృష్ణ పేర్కొన్నారు.

# మోదీ మాటల నుంచి స్ఫూర్తి పొందవచ్చు : బెల్జియం ప్రధాని



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 05: భారత ప్రధాని నరేంద్ర మోదీపై బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ ప్రశంసల వర్షం కురిపించారు. ప్రపంచంలో అత్యంత స్ఫూర్తిదాయకమైన నేతల్లో ప్రధాని మోదీ ఒకరని పేర్కొన్నారు. మోదీవి హేతుబద్ధమైన ఆలోచనలు అని కీర్తించారు. ఆయన చెప్పిన వాటిని మనం అనుసరించాలని పేర్కొన్నారు. మోదీ వివేకవంతమైన నిర్ణయాలు తీసుకుంటారని తెలిపారు. ప్రధాని మోదీ.. తెలివైన నాయకుడని అభివర్ణించారు. శనివారం దేశ ఆర్థిక రాజధాని ముంబై వేదికగా భారత్ - యూరోపియన్ యూనియన్ (ఈయూ) స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై ఇరు దేశాల మధ్య ఉన్నత స్థాయి చర్చలు జరిగాయి.ఈ సందర్భంగా బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ మాట్లాడుతూ.. భారత్‌లో పర్యటించడం గౌరవంగా ఉందన్నారు. శుక్రవారం న్యూఢిల్లీలో ప్రధాని మోదీతో తాను సమావేశమయ్యానని పేర్కొన్నారు. ఆయనతో భేటీ కావడం గౌరవంగా ఉందన్నారు. గతంలో కోవిడ్ కారణంగా తన భారత పర్యటన రద్దయిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు.ప్రపంచంలోని పలువురు నాయకులు బెదిరింపు ధోరణిలో మాట్లాడతారని అన్నారు. కానీ భారత ప్రధాని మోదీ మాటలు.. స్ఫూర్తితోపాటు మార్గదర్శకత్వాన్ని అందిస్తాయని చెప్పారు. నరేంద్ర మోదీ మాటలను అనుసరించాలనిపిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా సుంకాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనుసరిస్తున్న వైఖరిని బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ ఎండగట్టారు.

## ఆక్వా రైతుల చిరకాల సమస్యలకు సీఎం చంద్రబాబు పరిష్కారం

అమరావతి, సెప్టెంబర్ 5 : ఆక్వా రైతుల ఎన్నో ఏళ్ల సమస్యలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిష్కరించారు. ఈ మేరకు మత్స్యశాఖ జీవో నంబర్-1756ను విడుదల చేసింది. ఆక్వా రైతుల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తీసుకెళ్లారు. ఈ సమస్యలపై సీఎం సానుకూలంగా స్పందించి వెంటనే చర్యలు చేపట్టారు.మత్స్యశాఖ విడుదల చేసిన జీవోపై ఆక్వా రైతు సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గుడివాడ ప్రజావేదికలో ఎమ్మెల్యే రామును.. ఆక్వా రైతులు ఈరోజు (శనివారం) కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జీవోలోని నిబంధనలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రాము సూచించారు. గత ప్రభుత్వంలో పట్టించుకోని తమ సమస్యలకు కూటమి ప్రభుత్వంలో పరిష్కారం లభించిందని ఆక్వా రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు.

# నాకు మా అమ్మ మొదటి గురువు.. ఆమె దగ్గర చాలా నేర్చుకున్నాను: మంత్రి లోకేశ్



విజయవాడ, సెప్టెంబర్ 5 : 'నాకు మా అమ్మ మొదటి గురువు.. ఆమె దగ్గర చాలా నేర్చుకున్నాను. నాకు మంచి క్రమశిక్షణను మా ఉపాధ్యాయులు నేర్పారు' అని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. ఏపీ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు విజయవాడలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి లోకేశ్ పాల్గొని ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా విధానంలో అనేక మార్పులు తీసుకువచ్చామని ఉద్ఘాటించారు. డీఎస్సీ అంటే చంద్రబాబు, చంద్రబాబు అంటే డీఎస్సీ అని అభివర్ణించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం అమలు చేశారని తెలిపారు. డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి తేడా తెలియని వ్యక్తులు తనపై విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. వారికి వ్యవస్థలను నాశనం చేయడం తెలిస్తే, సీఎం చంద్రబాబుకు వ్యవస్థలను గాడిలో పెట్టడం తెలుసునని పేర్కొన్నారు.'ఉపాధ్యాయులు తలుచుకుంటే.. మట్టిలో మాణిక్యాలను సరస్వతీ పుత్రులుగా మార్చగలరు. ఈరోజు 175 మందిని ఉత్తమ ఉపాధ్యాయులుగా మేము ఎంపిక చేశాం. కేవలం సర్టిఫికెట్ ఇచ్చి సరిపెట్టకుండా.. సింగపూర్, ఇతర ప్రాంతాలకు పంపించాం. విద్యావ్యవస్థలో మార్పులు తీసుకువచ్చి.. ఇంకా మెరుగుపరిచేలా ఉపాధ్యాయులతోనే అధ్యాయనం చేయిస్తున్నాం. శివసుబ్రహ్మణ్యం అనే గురువు ప్రాక్టికల్‌గా వివరిస్తే.. నాడు స్టూడెంట్‌గా ఉన్న అబ్దుల్ కలాం సైంటిస్టుగా, భారతరత్నగా, రాష్ట్రపతిగా ఎదిగారు. మనందరిపైన కూడా అలాంటి పవిత్రమైన బాధ్యత ఉంది. సావిత్రిభాయి పూలే కాలంలో చదువుతానని ధైర్యంగా ముందుకు వచ్చి మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయునిగా మారారు. అలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకుని విద్యాశాఖను నేను ఎంచుకున్నాను. పాలనలో చిన్న చిన్న స్పీడ్ బ్రేకర్లు ఉంటాయి.. వాటిని స్వీకరిస్తాను. అంగన్‌వాడీ నుంచి ఇంటర్ చదవు వరకు ప్రపంచంలో మేటిగా ఏపీ నిలబడాలి' అని మంత్రి నారా లోకేశ్ ఆకాంక్షించారు.వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో 12లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేటు పాఠశాలకు వెళ్లారు. ఉపాధ్యాయులను మద్యం షాపుల ముందు వైసీపీ హయాంలో నిలబెట్టారు. మేము అందరితో మాట్లాడి జీవో నంబర్- 117ను రద్దు చేశాం. నేడు వన్ ప్లస్ వన్ టీచర్ విధానాన్ని తీసుకువచ్చాం. సీనియారిటీ లిస్ట్ ప్రకారం మెగా డీఎస్సీ ద్వారా 16వేల పోస్టులు ఇచ్చాం. ఏ అధికారుల చుట్టూ తిరగకుండా పారదర్శకంగా పోస్టులు, ప్రమోషన్లు, ట్రాన్స్‌ఫర్లు ఇచ్చాం. మధ్యాహ్న భోజన పథకాన్ని పాఠశాలలు, ఇంటర్ కళాశాలల్లో అమలు చేశాం. రైతులతో కూడా చర్చించి ఫైన్‌రైస్‌ను పిల్లలకు అందిస్తున్నాం. సీఎం చంద్రబాబు ఎంత చిత్తశుద్ధితో పని చేస్తున్నారో ఇలాంటి ఘనతలే నిదర్శనం. నిడమర్రులో మోడల్ స్కూల్‌గా లీప్ పాఠశాలను అభివృద్ధి చేశాం. అన్ని నియోజకవర్గాల్లో ఇదే మోడల్ స్కూళ్లను ఏర్పాటు చేయడం మా ప్రభుత్వం లక్ష్యం' అని మంత్రి నారా లోకేశ్ ఉద్ఘాటించారు.'చాగంటి కోటేశ్వరరావుకు క్యాబినెట్ ర్యాంకు ఇచ్చి... పిల్లల్లో మంచి ఆలోచనలు అందించేలా పుస్తకాలు అందించాం. ఈ విద్యా సంవత్సరంలో ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు లక్షా 10వేల మంది పిల్లలు వచ్చారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఆరు శాతం వృద్ధి రేటు చూపించాం. ఎప్పటికప్పుడు మారుతూ.. సవాళ్లను అధిగమించడం సీఎం చంద్రబాబు నాకు నేర్పుతారు. పోటీ పరీక్షల్లో కూడా విద్యార్థులు రాణించేలా శిక్షణ ఇస్తున్నాం. 23 క్లస్టర్స్‌ను తయారు చేస్తున్నాం.. అందరూ భాగస్వామ్యం కావాలి. రాజకీయ ప్రభావం లేకుండా ప్రతిభ ఆధారంగా కీలక పోస్టింగ్‌లు ఇచ్చాం' అని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

## గోదావరి కాలుష్యానికి కారణమైన ఏపీ పేపర్ మిల్‌పై ఉద్యమిస్తాం: మంత్రి కందుల దుర్గేశ్

రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 5 : ఏపీ పేపర్ మిల్ యాజామాన్యం వైఖరిపై ఆంధ్రప్రదేశ్ మంత్రి కందుల దుర్గేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గతంలో రాజమండ్రి వచ్చినప్పుడు ఈ పేపర్ మిల్ నుంచి వచ్చే కాలుష్యంపై సీరియస్ అయ్యారని పేర్కొన్నారు. పవన్ నిన్న చెప్పిన విధంగా గోదావరి కాలుష్యానికి కారణమైన ఈ పరిశ్రమపై ఉద్యమం చేయడానికి కూడా తాము వెనుకాడబోమని స్పష్టం చేశారు.ఫ్యాక్టరీనుంచి కాలుష్యంపై జాగ్రత్తలు తీసుకోవడానికి సంబంధిత యాజామాన్యానికి చాలా సమయం ఇచ్చామని తెలిపారు.ఇప్పటికీ ఈ పేపర్ మిల్ యాజమాన్యం ఎలాంటి జాగ్రత్తలు ఎందుకు తీసుకోవట్లేదని మంత్రి కందుల దుర్గేశ్ ప్రశ్నించారు.




# సంపాదకీయం

ఆదివారం 06-09-2026

## జీడీపీ పెరుగుతోంది... కానీ...

2026 ఏప్రిల్ నుంచి జూన్ మధ్య భారతదేశ వాస్తవ జీడీపీ 7.8 శాతం వృద్ధి చెందింది. గత సంవత్సరం ఇదే త్రైమాసికంలో వృద్ధి రేటు 6.9 శాతంగా ఉంది. ఆర్‌బిఐ 7 శాతం వృద్ధి రేటును అంచనా వేసింది. దీని అర్థం భారతదేశ పనితీరు అంచనాలను మించిపోయింది.అయితే ఈ పెరుగుదలకు సామాన్య ప్రజలు చేసే కొనుగోళ్లు అతిపెద్ద కారణం కాదు రోడ్లు, కర్మాగారాలు, యంత్రపరికరాలు , ఇతర ప్రధాన ప్రాజెక్టులలో పెట్టుబడి 11.9 శాతం పెరిగింది. సేవా రంగం 10 శాతం వృద్ధి చెందింది. బ్యాంకింగ్, రియల్ ఎస్టేట్, ఐటీ , వృత్తిపరమైన సేవలు 12.1 శాతం వృద్ధి చెందాయి. పోల్చి చూస్తే, సామాన్య ప్రజల వ్యయం 7.1 శాతం పెరగగా, వ్యవసాయ రంగం కేవలం 3.6 శాతం మాత్రమే పెరిగింది. దీని అర్థం ఏంటంటే, పెద్ద కంపెనీలు, తయారీ , సేవా రంగాలు దేశ వృద్ధిని నడిపించాయి. గ్రామీణ ప్రాంతాలు, చిన్న వ్యాపారాలు , సాధారణ కుటుంబాలు వెనుకబడి ఉన్నాయి. అందుకే సానుకూల జీడీపీ గణాంకాలు గృహ బడ్జెట్‌లలో ఇంకా స్పష్టంగా ప్రతిబింబించడం లేదు. దేశాలు, పెద్ద కంపెనీలు ఎక్కువ సంపాదించవచ్చు, కానీ అదే వేగంతో కొత్త ఉద్యోగాలు ఉండవు. యంత్రాలు, కొత్త సాంకేతికత తక్కువ మంది కార్మికులతో ఎక్కువ సాధించడానికి సహాయపడతాయి. దీనివల్ల ఉత్పత్తి, జీడీపీ పెరుగుతాయి, కానీ ఉద్యోగార్థులు తక్షణ ప్రయోజనాలను చూడలేరు.గత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక జీడీపీని 2011-12ను ప్రాతిపదికగా తీసుకున్న పాత విధానంలో కొందరు రూ.86 లక్షల కోట్లుగా లెక్కించారు.ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక జీడీపీని 2022-23 బేస్ ఇయర్‌గా తీసుకున్న కొత్త విధానంలో రూ.88 లక్షల కోట్లుగా లెక్కించారు.ఈ రెండు గణాంకాలను నేరుగా పోల్చడం వల్లే కొందరు విమర్శకులు వృద్ధి రేటు కేవలం 2-2.3 శాతమేనని చెబుతున్నారని నాగేశ్వరన్ పేర్కొన్నారు.అయితే, రెండు వేర్వేరు విధానాల్లో లెక్కించిన గణాంకాలను నేరుగా పోల్చడం సరికాదని స్పష్టం చేశారు.గత ఏడాది తొలి త్రైమాసిక జీడీపీ గణాంకాలను కూడా కొత్త విధానంలో తిరిగి లెక్కించి, ఆ తర్వాత ప్రస్తుత ఏడాది గణాంకాలతో పోల్చాలని సీఈఏ వివరించారు.పాత సిరీస్ కొనసాగి ఉంటే, కొత్త మెథడాలజీ ప్రకారం ఈజ26 ఖ1 జీడీపీ రూ.86 లక్షల కోట్ల కంటే ఎక్కువగా, దాదాపు రూ.90 లక్షల కోట్లకు చేరి ఉండేదని ఆయన అంచనా వేశారు.అలా సవరించిన గత ఏడాది గణాంకంతో ప్రస్తుత ఏడాది రూ.88 లక్షల కోట్ల జీడీపీని పోల్చినప్పుడే వాస్తవికమైన, న్యాయమైన వృద్ధి రేటు తెలుస్తుందని చెప్పారు.అంతేకానీ, భిన్నమైన కొలమానాలతో వచ్చిన రెండు అంకెలను నేరుగా పోల్చి వృద్ధిని అంచనా వేయడం సరైన పద్ధతి కాదన్నారు.గత ఏడాది జీడీపీ గణాంకాల్లో వచ్చిన మార్పులకు కేవలం డబుల్ డిఫ్లేటర్ విధానమే కారణం కాదని నాగేశ్వరన్ తెలిపారు.మెరుగైన కార్యనిర్వహణ, అసంఘటిత రంగానికి మరింత విస్తృతమైన కవరేజీ వంటి పలు అంశాలు కూడా ఇందుకు కారణమని వివరించారు.కొత్త విధానంలో ఈజ26 గణాంకాలు పెరగకపోవడం కూడా గతంలోనే ఆర్థిక వ్యవస్థను సరైన స్థాయిలో కవర్ చేశామనడానికి ఒక సూచనగా ఆయన పేర్కొన్నారు.జీడీపీని లెక్కించేటప్పుడు నామినల్ జీడీపీ, అంటే ధరల మార్పుల ప్రభావంతో కూడిన గణాంకం నుంచి రియల్ జీడీపీని గుర్తించాలి.రియల్ జీడీపీ అంటే ధరల ప్రభావాన్ని తొలగించిన తర్వాత ఉత్పత్తి వాస్తవంగా ఎంత పెరిగిందో చూపించే గణాంకం.ఇందుకోసం ద్రవ్యోల్బణ ప్రభావాన్ని తొలగించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో ఉపయోగించే సాధనాన్నే 'డిఫ్లేటర్' అంటారు.అంతర్జాతీయ సంస్థల సూచనలతోనే డబుల్ డిఫ్లేటర్ విధానం తీసుకోలేదుడబుల్ డిఫ్లేటర్ పద్ధతిని కేవలం అంతర్జాతీయ సంస్థల సూచనల మేరకే భారత్ అనుసరిస్తోందన్న వాదనను నాగేశ్వరన్ తోసిపుచ్చారు.గణాంక నిపుణులతో విస్తృతంగా చర్చించిన తర్వాతే ఈ విధానాన్ని ఎంచుకున్నామని తెలిపారు.ఇన్‌పుట్, అవుట్‌పుట్ ధరలు వేర్వేరు కారణాల వల్ల మారుతుంటాయని, అందువల్ల వాటి ధరల ప్రభావాన్ని శాస్త్రీయంగా అంచనా వేయడానికి డబుల్ డిఫ్లేటర్ పద్ధతి సరైనదని వివరించారు.దేశ ఆర్థిక వ్యవస్థ నమోదు చేసిన 7.8 శాతం వృద్ధి రేటు అకస్మాత్తుగా వచ్చినది కాదని నాగేశ్వరన్ స్పష్టం చేశారు.దీనికి ముందే పలు నెలవారీ ఆర్థిక సూచికలు బలమైన వృద్ధి సంకేతాలను ఇచ్చాయని తెలిపారు.జీఎస్టీ వసూళ్లు, ఈ-వే బిల్లుల జారీ, వాహన విక్రయాలు, ఎగుమతుల వృద్ధి, బ్యాంకు రుణాల పెరుగుదల వంటి సూచికలు ఆర్థిక కార్యకలాపాల్లో వేగాన్ని ముందుగానే సూచించాయని పేర్కొన్నారు.ఈ వివరాలు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కస్టమ్స్, ప్రభుత్వ ఖజానా వంటి విశ్వసనీయ వనరుల నుంచి సేకరించినవేనని చెప్పారు. ఉద్యోగాలపై ప్రభావం చూపే అంశాలు ఒక్కటే కావని, సాంకేతిక పరిజ్ఞానంలో మార్పులు, సామాజిక-ఆర్థిక పరిస్థితులు, స్వచ్ఛందంగా ఉద్యోగం చేయకూడదనే నిర్ణయం వంటి అనేక అంశాలు దీనిపై ప్రభావం చూపుతాయని వివరించారు.ఇతర దేశాలతో పోలిస్తే భారతదేశంలో ఉద్యోగాల వృద్ధికి సంబంధించిన ధోరణులు మెరుగ్గా ఉన్నాయని నాగేశ్వరన్ అభిప్రాయపడ్డారు.

## 'వారంతా కలిసి కాంగ్రెస్‌ను బొంద పెట్టడం ఖాయం'

**ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్, రాంచందర్ నాయక్**

**హాలియాలో విద్యార్థులు, యువత, నిరుద్యోగులతో కలిసి భారీ నిరసన ర్యాలీ**

హాలియా, సెప్టెంబర్ 05 : కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వెయ్యి రోజుల పరిపాలన విద్యార్థి, యువత, నిరుద్యోగులను దగా చేసిందని ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, నాగార్జునసాగర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ గత శాసనసభ ఎన్నికల్లో యూత్ డిక్లరేషన్ పేరుతో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ హాలియాలో విద్యార్థులు, యువత, నిరుద్యోగులతో కలిసి భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.



రామాలయం నుండి బస్టాండ్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వెంటనే కాంగ్రెస్ నిరుద్యోగులకు నెలకు రూ.4 వేల చొప్పున నిరుద్యోగ భృతి చెల్లిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. తాము అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులైనా ఇప్పటికీ నిరుద్యోగ భృతి చెల్లించకపోగా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయలేదన్నారు. విద్యార్థులకు పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేస్తానని హామీ ఇవ్వడం జరిగిందన్నారు.కానీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వెయ్యి రోజుల్లో కూడా విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ గానీ ఫీజు రీయింబర్స్‌మెంట్ గాని విడుదల చేయలేదని విమర్శించారు. ఎన్నికల ముందు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగ నోటిఫికేషన్ వెయ్యకుండా నిరుద్యోగ భృతిని చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందన్నారు. విద్యార్థినీలకు స్కూటీలను పంపిణీ చేస్తామని హామీ ఇచ్చి అవి కూడా ఇప్పటికీ పంపిణీ చేయలేదని తెలిపారు. మొత్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థి, యువత, నిరుద్యోగులను మోసం చేసిందని దుయ్యబట్టారు. విద్యార్థి, యువత, నిరుద్యోగులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం కూడా రాష్ట్రంలో గానీ దేశంలో గానీ మనుగడ సాగించిన దాఖలాలు లేవన్నారు. రాష్ట్ర ప్రభుత్వ తీరుపై విద్యార్థి, యువత, నిరుద్యోగులు ఆగ్రహంతో ఉన్నారని, వారంతా కలిసి భవిష్యత్‌లో కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టడం ఖాయమని పేర్కొన్నారు.

## హైదరాబాద్ ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవాలకు ప్రభుత్వ నిధులు: దానం నాగేందర్





హైదరాబాద్, సెప్టెంబర్ 5: నగరంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవాలు ఈసారి మరింత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. ఉత్సవాల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించిన ఆయన.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విభాగాలతో సమన్వయం చేసుకుంటూ పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.ఈ ఏడాది ఖైరతాబాద్ గణేశ్‌ను దర్శించుకునేందుకు 30 లక్షల మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే నేపథ్యంలో ట్రాఫిక్, భద్రత, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం తరఫున కూడా ఉత్సవాల ఏర్పాట్ల కోసం అవసరమైన నిధులను కేటాయిస్తామని దానం నాగేందర్ పేర్కొన్నారు.ఈసారి సెప్టెంబర్ 11వ తేదీ సాయంత్రం ఖైరతాబాద్ గణేశ్ ఆగమన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు దానం నాగేందర్ తెలిపారు. గణేశ్ విగ్రహ తయారీ కొంత ఆలస్యమైన మాట వాస్తవమేనని అంగీకరించిన ఆయన.. అయితే చవితికి రెండు రోజుల ముందుగానే భక్తులకు గణేశుడి దర్శనం కల్పించేలా నిర్విరామంగా పనులు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. విగ్రహ తయారీతో పాటు మండపం, పరిసర ప్రాంతాల అభివృద్ధి, భక్తుల రాకపోకలకు అనుగుణంగా ఏర్పాట్లను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. భారీ ఉత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీతో పాటు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని చెప్పారు. భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ.. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు దానం నాగేందర్ వెల్లడించారు.

## విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల కొరకు నిరసన ర్యాలీ- రావుల శ్రీధర్ రెడ్డి

ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఎండగడతామంటూ మోతీ నగర్ లో సాయి కిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల చెల్లింపు లో జరుగుతున్న నిర్లక్ష్యానికి నిరసనగా భారీ ర్యాలీ ని చేపట్టారు.ర్యాలీ లో బి.ఆర్.ఎస్ నాయకులు మాజీ సాప్ చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ బకాయిలు చెల్లించకుండా నేరుగా విద్యార్థుల ఖాతాల్లోకి ఫీజు రియంబర్స్మెంట్ ను బదిలీ చేస్తామంటూ కాంగ్రెస్ ప్రభుత్వం నాటకాలు ఆడుతున్నారన్నారు. కాంగ్రెస్ చేసే ఈ అన్యాయాన్ని ప్రజాక్షేత్రంలో బహిర్గతం చేయడానికి రాష్ట్రవ్యాప్తంగా బిఆర్ఎస్ శ్రేణులు చేపట్టిన నిరసన ర్యాలీలలో భాగంగా భారీగా విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టినట్టు తెలిపారు. విద్యార్థులు తమకు జరిగే అన్యాయాన్ని ఎదురించి విద్యార్థి దశ నుండే పోరాట పటిమ అలవర్చుకోవలని విజ్ఞప్తి చేశారు.విద్యార్థులకు అన్ని విధాలుగా బిఆర్ఎస్ అండగా ఉంటుందని అన్నారు.ఇకనైనా విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్ చెల్లించాలని డిమాండ్ చేశారు.

## బెంగళూరులో దారుణం.. అప్పు తీర్చలేదని మహిళను వివస్త్రను చేసి..



కర్ణాటకలో దారుణ సంఘటన చోటుచేసుకుంది. అప్పు కట్టలేదన్న కోపంతో మహిళపై ఘాతుకానికి ఒడిగట్టారు కొందరు వ్యక్తులు. మహిళను వివస్త్రను చేసి కొట్టారు. ఈ దారుణాన్ని సెల్‌ఫోన్‌లో వీడియో కూడా చిత్రీకరించారు. అప్పు తీర్చకపోతే వీడియోను ఆన్‌లైన్‌లో పెడతామని బెదిరించారు. మహిళపై దాడి చేసిన నలుగురు వ్యక్తులను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. కేసుకు సంబంధించి పోలీసులు తెలిపిన పూర్తి వివరాల్లోకి వెళితే.. బెంగళూరుకు చెందిన బాధితురాలు.. రేష్మ అనే మహిళ నుంచి కొన్ని నెలల క్రితం 50 వేల రూపాయల అప్పు తీసుకుంది.ప్రతినెల 5 వేల రూపాయలు చెల్లించేది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ నాలుగు వారాల పాటు ఆవె డబ్బులు కట్టలేదు. రేష్మ తనను వేధిస్తుందేమోనని భయపడిపోయిన బాధితురాలు.. రేష్మ ఫోన్ నెంబర్‌ను బ్లాక్ చేయటంతో పాటు వేరే ఇంటికి మారిపోయింది. రెండు రోజుల క్రితం నజ్రత్ అనే మహిళ బాధితురాలికి ఫోన్ చేసింది. పనితో పాటు కొంత డబ్బు కూడా ఇప్పిస్తానని చెప్పింది. బాధితురాలు నజ్రత్ ఇంటికి వెళ్లగా.. సొహైల్ అనే వ్యక్తి బాధితురాలిపై దాడి చేశాడు.నజ్రత్, సోహైల్, రేష్మ, సైఫ్.. బాధితురాలిని కుంబల్‌గోడులోని ఓ ఇంటికి తీసుకెళ్లారు. అక్కడ ఆమెను వివస్త్రను చేసి తీవ్రంగా కొట్టారు. ఈ దారుణాన్ని వీడియో తీశారు. వీలైనంత త్వరగా డబ్బులు కట్టకపోతే వీడియోను ఆన్‌లైన్‌లో పెడతామని బెదిరించారు. బాధితురాలి తల్లి ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నలుగురు నిందితులను శుక్రవారం అరెస్ట్ చేశారు.


## ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు.. 8 మంది దుర్మరణం..



తిరువనంతపురం, సెప్టెంబర్ 5: కేరళలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డుపక్క ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టిన ఘటనలో 8 మంది మృతి చెందారు. శుక్రవారం రాత్రి ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడుకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు కారులో కేరళ పర్యటనకు వచ్చారు. గురువాయూర్ పర్యటన ముగిసిన తర్వాత కొడుంగలూర్ వైపు బయలు దేరారు. శుక్రవారం రాత్రి 11.30 గంటల ప్రాంతంలో ఊహించని పరిణామం చోటుచేసుకుంది.వారు ప్రయాణిస్తున్న కారు త్రిస్సూర్ జిల్లాలోని కైపమంగలం వద్ద హైవేపై ప్రమాదానికి గురైంది. రోడ్డుపక్క ఆగి ఉన్న ఓ లారీని కారు ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఫైర్, రెస్క్యూ, పోలీసు సిబ్బందితో పాటు స్థానికులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ఎనిమిది మృతదేహాలను కారునుంచి బయటకు తీశారు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం త్రిస్సూర్ మెడికల్ కాలేజ్‌కు తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## వంట విషయంలో గొడవ.. భార్యను కొట్టి చంపిన భర్త..

వంట విషయంలో గొడవ కారణంగా ఓ నిండు ప్రాణం బలైంది. ఓ భర్త తన భార్యను దారుణంగా కొట్టి చంపేశాడు. ఈ సంఘటన మహారాష్ట్రలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నాగ్‌పూర్‌కు చెందిన 41 ఏళ్ల కృష్ణలాల్ యాదవ్, యామిని కృష్ణలాల్ యాదవ్ భార్యాభర్తలు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గురువారం సాయంత్రం కృష్ణలాల్ పని ముగించుకుని ఇంటికి వచ్చాడు. తన కోసం, పిల్లల కోసం వంట చేయమని అడిగాడు. డ్యాన్స్ క్లాస్‌కు వెళ్లడానికి సిద్ధమవుతున్న ఆమె వంట చేయడానికి ఒప్పుకోలేదు.దీంతో ఇద్దరి మధ్యా గొడవ మొదలైంది. ఆ గొడవ చిలికిచిలికి గాలివానలా మారింది. మద్యం మత్తులో ఉన్న కృష్ణలాల్ భార్యపై విరుచుకుపడ్డాడు. ఆమె గొంతు, పొత్తి కడుపుపై బలంగా దాడి చేశాడు. దెబ్బల కారణంగా యామిని విలవిల్లాడింది. గొంతు, కడుపు విపరీతంగా నొప్పి తీస్తున్నాయని భర్తకు చెప్పింది. నొప్పుల మాత్రలు తీసుకురమ్మని అడిగింది. కృష్ణలాల్ మెడికల్



స్టోర్‌కు వెళ్లాడు. షాపు మూసి ఉండటంతో నొప్పుల మాత్రలు తేకుండానే వెనక్కు తిరిగి వచ్చాడు. ఓ గంట తర్వాత యామిని ఆరోగ్య పరిస్థితి దారుణంగా దిగజారింది.కడుపు లోపలి అవయవాలకు గాయాలు అవ్వటంతో యామిని కడుపు బాగా ఉబ్బిపోయింది. భర్త ఆమెను ఆస్పత్రికి తరలించాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యామిని ప్రాణాలు కోల్పోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకున్నారు. యాక్సిడెంటల్ డెత్‌గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యామిని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం రిపోర్టులో.. బలమైన గాయాల కారణంగా యామిని గొంతు ఎముక విరిగిందని, కడుపులో పేగులు తీవ్రంగా దెబ్బ తిన్నాయని తేలింది. దీంతో పోలీసులు కేసును మర్డర్ కేసుగా మార్చి, యామిని భర్తను అరెస్ట్ చేశారు.

# ద్వారంపూడిపై ప్రభుత్వం దృష్టి

కాకినాడ, సెప్టెంబర్ 5, కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు నిత్యం వివాదాస్పద వ్యాఖ్యలతో నాటి విపక్ష పార్టీలపై విరుచుకుపడిన ద్వారంపూడి చుట్టూ ఉచ్చు బిగుసుకుంటున్నట్లు కనిపిస్తుంది. ఇటీవల పలు కేసుల్లో వైసీపీ నేతలు వరసగా అరెస్ట్ లు అవుతున్నారు. తర్వాత వంతు ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిదేనన్న ప్రచారం ఊపందుకుంది. ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో స్థానికంగా ఉన్న జనసేన కార్యకర్తలపై కూడా దాడులు చేయించారన్న ఆరోపణలున్నాయి. అలాగే అనేక భూ వివాదాలు, రేషన్ బియ్యం తరలింపు వంటి ఆరోపణలను ద్వారంపూడి ఎదుర్కొన్నారు. వాటిన్నంటిపై ఒక్కొక్కటిగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విచారణలకు ఆదేశించింది. స్థానిక సంస్థల ఎన్నికలలోపే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిపై చర్యలు తీసుకునే అవకాశాలున్నాయన్న ప్రచారం పెద్దయెత్తున జరగుతుంది. ద్వారంపూడిపై విచారణలు, కేసులను ప్రభుత్వం వేగవంతం చేసింది.ద్వారంపూడిపై కూటమి ప్రభుత్వ చర్యలు ప్రారంభించింది.కాకినాడ పోర్టు భూముల కుంభకోణం, బియ్యం స్మగ్లింగ్ వంటి వ్యవహారాలపై ఆయనపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి సిద్ధమయినట్లు తెలిసింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఆయనపై తదుపరి చర్యలు ఉంటాయనే చర్చ రాజకీయ వర్గాల్లో నడుస్తోంది. వరసగా విచారణలు ఒక్కొక్కటిగా పూర్తి కావస్తుండటం ద్వారంపూడిపై క్రిమినల్ చర్యలకు సిఫార్సులు చేస్తుండటంతో నెక్ట్స్ టార్గెట్ ఆయనేనన్న టాక్ మాత్రం రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తుంది. కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి టీడీఆర్ బాండ్ల కుంభకోణం వివాదంలో చిక్కుకుని క్రిమినల్ విచారణను ఎదుర్కొంటున్నారు.టీడీఆర్ బాండ్ల వివాదం మరియు విజిలెన్స్ సిఫార్సులు చేసింది. కాకినాడలో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ ప్లాంటు కోసం 23 ఎకరాలు సేకరించాల్సి ఉండగా, కేవలం 4.66 ఎకరాలను మాత్రమే నకిలీ నోటిఫికేషన్‌తో అత్యవసరంగా సేకరించారన్న ఆరోపణలున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా, ఒక నిర్దిష్ట భూ యజమానికి లబ్ధి చేకూర్చేలా వ్యవహరించారని ఆరోపణలు వచ్చాయి.ఈ భూమి ముళ్లపొదలతో, వినియోగానికి పనికిరాని లోతట్టు ప్రాంతంలో ఉన్నప్పటికీ టీడీఆర్ బాండ్లు జారీ చేశారనే విమర్శలున్నాయి.ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. తనపై కూటమి ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని, అక్రమ కేసులు బనాయిస్తున్నారని ద్వారంపూడి వర్గీయులు ఆరోపిస్తున్నారు.

# జనాల్లోకి జై కొట్టు నినాదం

విజయవాడ, సెప్టెంబర్ 5, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ యువ ఓటర్లపై కన్నేశారు. కేవలం స్థానిక సంస్థల ఎన్నికలు మాత్రమే కాదు.. రానున్న ఏ ఎన్నికల్లోనైనా యువత ఓటర్లను ఆకట్టుకోవాలన్న లక్ష్యంగా జనసేన పనిని ప్రారంభించింది. ఇందులో భాగంగా జనసేన యువజన విభాగాన్ని ఆర్భాటంగా పవన్ కల్యాణ్ పుట్టిన రోజు నాడు ప్రారంభించింది. దేశ వ్యాప్తంగా జెన్ జీ ఫీవర్ అన్ని రాజకీయ పార్టీలను పట్టిపీడిస్తుంది. అందులో భాగంగా జనసేన కూడా యువత ఓట్ల కోసం వేట ప్రారంభించింది. పవన్ కల్యాణ్ పై గత రెండేళ్ల నుంచి ఎలాంటి అవినీతి ముద్ర పడలేదు. ఆయన తనకు అప్పగించిన బాధ్యతలను సజావుగా, సమర్థవంతంగా చేస్తున్నారన్న ప్రశంసలను కూడా అందుకుంటున్నారు. అవినీతి మరక అంటకుండా ఉన్న తనకు అండగా నిలబడాలని పవన్ కల్యాణ్ కోరుకుంటున్నారు. యువత అండగా నిలిస్తే విజయం నల్లేరు మీద నడకేనని భావిస్తున్నారు.ఇలాగే తన వైఖరిని కొనసాగిస్తే రానున్న అసెంబ్లీ ఎన్నికల్లోనూ జనసేనకు కూటమిలో పొత్తులో భాగంగా అత్యధిక స్థానాలను పొందవచ్చు. యువ నేతలకు పోటీకి అవకాశమిస్తే ప్రజల నుంచి కూడా ఆదరణ లభించే ఛాన్స్ ఉంది. కేవలం కాపు సామాజికవర్గానికి చెందిన ఓటర్ల పైనే ఆధార పడకుండా యువ ఓటర్లను కూడా ఆకట్టుకునే ప్రయత్నం చేయనున్నారు. పవన్ కల్యాణ్ కేరళ నుంచి తిరిగి వచ్చిన వెంటనే యువతతో ప్రత్యేక సమావేశాలను కూడా నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఒకవైపు పార్టీ బలాన్ని పెంచుకోవడం, ఓటు బ్యాంకు పెంచుకోవడంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటితే అసెంబ్లీ ఎన్నికల నాటికి మరింతగా ఎదిగే అవకాశాలు ఉంటాయని జనసేన పార్టీ నాయకత్వం కూడా అంచనా వేస్తుంది. యువత, మహిళ ఓటర్లను ఆకట్టుకోగలిగితే ఇక తనపై సామాజికవర్గం ముద్ర పడకపోయినా పెద్దగా ఉండదని పవన్ కల్యాణ్ విశ్వసిస్తున్నారు. జైకొట్టు నినాదంతో... జనసేన పార్టీ యువతను, ముఖ్యంగా 'జెన్-జీ' ని ఆకట్టుకోవడానికి ప్రత్యేక వ్యూహాలతో ముందుకు వెళ్తోంది.'జై కొట్టు' యువజన విభాగంపవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా పిఠాపురంలో జనసేన తొలిసారిగా ప్రత్యేక యువజన విభాగాన్ని ఆవిష్కరించింది.'చేయెత్తి జైకొట్టు తెలుగోడా' స్ఫూర్తితో ఈ విభాగానికి 'జై కొట్టు' అని పేరు పెట్టారు.జెన్-జీ యువతను రాజకీయాల్లోకి, సామాజిక కార్యక్రమాల్లోకి భాగస్వామ్యం చేయడమే దీని ప్రధాన లక్ష్యం. నేటి తరానికి తగినట్లుగా ఆలోచనా విధానాన్ని అధ్యయనం చేస్తూ పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా సంభాషణలు సాగించనున్నారు.సోషల్ మీడియాను సమర్థవంతంగా వినియోగించుకుంటూ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని యువతకు పిలుపునిచ్చారు. సోషల్ మీడియాలో యువత అయితే మరింత పార్టీని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లగలుగుతారన్న నమ్మకంతో ఉన్నారు. మొత్తం మీద జనసేన ఇప్పుడు జెన్ జీ ఆకట్టుకునేందుకు అవసరమైన వ్యూహంతో పవన్ కల్యాణ్ ముందుకు వెళుతున్నారు. మరి పవన్ జెన్ జీ వ్యూహం ఎంత మేరకు ఫలిస్తుందన్నది చూడాలి.

# నెల్లూరు జిల్లా వాసి ఒంగోలులులో లాక్ అప్ డెత్ !

ఒంగోలుఒంగోలు పోలీసుల లాకప్లోనే తన కుమారుడ్ని చంపేశారని బాధిత తల్లి కన్నీరు పెడుతోంది. పొలాల్లో దివ్యతేజ మృతదేహం లభ్యం అయింది. బోగోలు మండలంకు చెందిన దివ్య తేజను పోలీసులే హతమార్చారని తల్లి, సోదరి ల ఆరోపణ. విచారణ నిమిత్తం తీసుకెళ్ళి తమకు తెలియదు అని పోలీసులు వాదించారు. ఐదు రోజులు దివ్యతేజ ఆచూకీ కోసం తీవ్రంగా శ్రమించాం.. మిస్సింగ్ కేసు కూడా నమోదు చేయాలి అని ఒత్తిడి తెచ్చామని అన్నారు.పోలీసులే తీసుకెళ్ళి తీవ్రంగా గాయపరిచారు, పోలీస్ దెబ్బలకే తేజ చనిపోయాడు. మృతదేహాన్ని కూడా మాయం చేయాలి అని చూశారు. హైకోర్టులో పిటిషన్ వేయడంతో ఒక గంటలో మృతిదేహం లభించింది అని డ్రామా చేశారని ఆరోపించారు. హైకోర్టును ఆశ్రయించకపోయింటే శవాన్ని కూడా ఇచ్చే వారు కాదు.

# సుదీర్ఘ పాదయాత్రకు జగన్



కడప, సెప్టెంబర్ 5, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పాదయాత్ర అనేది కేవలం ఒక ప్రచార సాధనమే కాదు.. అధికార పీఠాన్ని దక్కించుకునే ఒక పొలిటికల్ మాస్టర్ స్ట్రోక్. తండ్రి వైఎస్సార్ అడుగుజాడల్లో నడిచి 2017లో సుదీర్ఘ పాదయాత్ర ద్వారా 2019లో ప్రభంజనం సృష్టించిన వైఎస్ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఇప్పుడు మరొకసారి అదే అస్త్రాన్ని ప్రయోగించేందుకు సిద్ధమవుతున్నారు. వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని 2027 జూలై 8 నుంచి లేదా ఆ తర్వాతి నెలల్లో 2029 ఎన్నికలే లక్ష్యంగా సుదీర్ఘ పాదయాత్రను ప్రారంభించాలని జగన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఏర్పడిన మూడున్నరేళ్ల తర్వాత పూర్తిస్థాయిలో రోడ్డెక్కి, ఎన్నికల దాకా ప్రజల్లోనే ఉండటం ద్వారా ప్రజా మూడ్‌ను తమ వైపు తిప్పుకోవచ్చని వైసీపీ బలంగా నమ్ముతోంది.వైసీపీ అంచనాల ప్రకారం.. ప్రభుత్వ పదవీకాలం చివరి దశకు వచ్చేసరికి కూటమి ప్రభుత్వంపై సహజంగానే కొంత అసంతృప్తి లేదా వ్యతిరేకత మొదలవుతుంది. ఆ సమయానికే సరిగ్గా క్షేత్రస్థాయిలోకి వెళ్లి, ప్రభుత్వం ఇచ్చిన హామీల వైఫల్యాలను ఎండగడుతూ, సంక్షేమ పథకాల కొరతను ఎత్తిచూపితే ప్రజల మూడ్ వేగంగా మారుతుందనేది జగన్ వ్యూహం. గతంలో కూడా 2017 నవంబర్ నుంచి 2019 ఎన్నికల వరకు సుమారు 14 నెలల పాటు నిరంతరం ప్రజల్లో ఉండటం వల్లనే 151 సీట్ల భారీ విజయం సాధ్యమైందని, అదే సెంటిమెంట్‌ను, రాజకీయ వ్యూహాన్ని మళ్లీ పునరావృతం చేయాలని భావిస్తున్నారు.అయితే, 2017 నాటి పరిస్థితులకు, ప్రస్తుత 2027-28 నాటి రాజకీయ పరిస్థితులకు భూమికి ఆకాశానికి ఉన్నంత తేడా ఉందని చాలా మంది చెబుతున్నారు. 2017లో జగన్ ఒక నవ నాయకుడిగా, అవకాశం ఇవ్వాల్సిన కొత్త ఆశాకిరణంగా ప్రజల్లోకి వెళ్లారు. కానీ ఇప్పుడు ఆయన 5 ఏళ్ల పాలనా అనుభవాన్ని, ప్రజా తీర్పును చూసి ప్రతిపక్షంలో కూర్చున్న నాయకుడు. గతంలో తను ఇచ్చిన హామీలు, ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అభివృద్ధి లేదా వివాదాలపై కూటమి ప్రభుత్వం ఆయనను క్షేత్రస్థాయిలోనే డిఫెన్స్‌లో పడేసే ప్రమాదం ఉంది. అప్పట్లో అలా చేశారు.. ఇప్పుడు ఇలా అడుగుతున్నారు అనే ప్రశ్నలు ఆయనకు పెద్ద సవాలుగా మారవచ్చు.మరోవైపు, అధికారంలో ఉన్న టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి సైతం జగన్ యాత్రను తేలికగా తీసుకునే ప్రసక్తే లేదు. నాడు చంద్రబాబు ఒంటరిగా ఉంటే, నేడు పవన్‌కల్యాణ్ తోడ్పాటు, కేంద్రంలోని బీజేపీ అండదండలు కూటమికి బలంగా ఉన్నాయి. జగన్ పాదయాత్ర ప్రారంభించేనాటికే కౌంటర్ వ్యూహాలతో, ముఖ్యంగా సూపర్‌సిక్స్ హామీల అమలు, క్షేత్రస్థాయి సంక్షేమ ఫలాలను వేగవంతం చేయడం ద్వారా జగన్ పాదయాత్ర మైలేజ్‌ను తగ్గించడానికి కూటమి నాయకత్వం ప్రయత్నిస్తుంది. పైగా, జగన్ పాదయాత్ర వెళ్లే మార్గాల్లో ఎదురయ్యే ప్రజా నిలదీతలను తిప్పికొట్టడం వైసీపీ కేడర్‌కు పరీక్షగా మారనుంది. దీనికితోడు వైసీపీలో ఉన్న ప్రధాన లోపం ద్వితీయ శ్రేణి నాయకత్వం వికేంద్రీకరణ . ఒకప్పుడు జగన్ వెనక నడిచిన సీనియర్ నేతలలో కొందరు నిశ్శబ్దంగా ఉండటం, మరికొందరు పార్టీ వీడటం వల్ల క్షేత్రస్థాయి యంత్రాంగం బలహీనపడింది. కేవలం జగన్ ఇమేజ్ మీదనే మళ్లీ గెలవడం కష్టమని, బలమైన నియోజకవర్గ స్థాయి నేతలు లేకపోతే పాదయాత్ర తెచ్చిపెట్టే ఉత్సాహం ఓట్లుగా మారడం కష్టమనే అభిప్రాయం ఉంది. కేడర్‌లో మళ్లీ జోష్ నింపడం, నైరాశ్యంలో ఉన్న నేతలకు భరోసా ఇవ్వడం జగన్ ముందున్న తక్షణ కర్తవ్యం. ప్రతీసారి పాదయాత్ర ఒకే రకమైన ఫలితాన్ని ఇస్తుందనుకోవడం పొరపాటే. ప్రతిపక్ష నేతగా ప్రజల వద్దకు వెళ్లినప్పుడు వారి సమస్యలకు పరిష్కారం చూపే స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను, విశ్వసనీయతను చూపించగలిగితేనే పాదయాత్ర సక్సెస్ అవుతుంది. పాత ఫార్ములానే నమ్ముకోకుండా, సరికొత్త హామీలతో, పొరపాట్లను సరిదిద్దుకుంటూ జగన్ ప్రజల్లోకి వెళితేనే ఈ పాదయాత్ర 2.0 వైసీపీని మళ్లీ రేసులోకి తీసుకెళ్లే అవకాశాలు ఉంటాయి

# బెజవాడ మేయర్ రేసులో వంగవీటి రాధా

విజయవాడ, సెప్టెంబర్ 5, ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు గుండెకాయ వంటి విజయవాడ నగరంలో ఊహించని రాజకీయ పరిణామాలు ఊపందుకుంటున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు సంబంధించిన స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ త్వరలోనే వెలువడే సూచనలు కనిపిస్తుండటంతో అధికార, ప్రతిపక్ష శిబిరాల్లో కదలిక మొదలైంది. ఈ తరుణంలో టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నుంచి వంగవీటి మోహన రంగా తనయుడు, సీనియర్ నేత వంగవీటి రాధాకృష్ణకు ప్రత్యేక పిలుపు రావడం బెజవాడ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. సీఎం చంద్రబాబుతో రాధా త్వరలోనే భేటీ కానున్నారన్న వార్త విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సమీకరణాలను పూర్తిగా మార్చేలా కనిపిస్తోంది.రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లకు ఈసారి కౌన్సిలర్లు కాకుండా, ప్రజలే నేరుగా ఓటు వేసి మేయర్లను ఎన్నుకునే ప్రత్యక్ష ఎన్నికల పద్ధతి ని



ప్రవేశపెట్టాలని కూటమి ప్రభుత్వం గట్టిగా యోచిస్తోంది. విజయవాడ నగర కార్పొరేషన్ భౌగోళికంగా తూర్పు, పశ్చిమ, మధ్య నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉంది. అంటే, ప్రత్యక్ష పద్ధతిలో మేయర్‌గా పోటీ చేయడమంటే దాదాపు మూడు అసెంబ్లీ స్థానాల విస్తీర్ణంలో, లక్షలాది మంది ఓటర్లను నేరుగా ఎదుర్కోవాల్సి రావడం. ఇంతటి విస్తృతమైన పరిధిలో కేవలం పార్టీ గుర్తు మాత్రమే సరిపోదని, నగరం మొత్తాన్ని ప్రభావితం చేయగల బలమైన ప్రజాదరణ, మాస్ ఇమేజ్ ఉన్న నాయకుడిని బరిలోకి దించితేనే విజయం నల్లేరుపై నడక అవుతుందని టీడీపీ అగ్రనాయకత్వం ఒక నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం.విజయవాడ నగర సామాజిక, రాజకీయ ముఖచిత్రంలో వంగవీటి కుటుంబానికి తరగని అభిమాన గణం ఉంది. రంగా పేరు వింటే నేటికీ బెజవాడలో ఒక ప్రత్యేకమైన ఉద్వేగం కనిపిస్తుంది. కాపు సామాజిక వర్గంతో పాటు ఇతర దిగువ, మధ్యతరగతి ప్రజల్లోనూ, యువతలోనూ రాధాకు మంచి ఆదరణ ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి విజయానికి విస్తృతంగా ప్రచారం నిర్వహించినప్పటికీ, అప్పట్లో సీట్ల సర్దుబాటు వల్ల రాధాకు ప్రత్యక్షంగా టికెట్ లభించలేదు. ఆ తర్వాత ప్రభుత్వం ఏర్పడినప్పటికీ ఆయన ఎలాంటి పదవినీ ఆశించలేదు. ఇప్పుడు స్వయంగా మూడు నియోజకవర్గాల సమానమైన మేయర్ పీఠానికి ఆయనను బరిలో దింపడం ద్వారా ఆయన స్థాయిని తగ్గించకుండానే సరైన గౌరవం ఇచ్చినట్లవుతుందని కూటమి పెద్దలు భావిస్తున్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో జరగబోయే కీలక భేటీలో ప్రధానంగా మేయర్ అభ్యర్థిత్వం గురించే చర్చించనున్నట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ప్రత్యక్షంగా మేయర్ రేసులో నిలబడేందుకు రాధా సిద్ధంగా ఉన్నారా లేదా ఆయన ఆలోచనలు ఎలా ఉన్నాయన్నది చంద్రబాబు నేరుగా తెలుసుకోనున్నారు. ఒకవేళ రాధా నేరుగా పోటీకి విముఖత చూపితే, ఆయన కుటుంబానికి చెందిన వారిని బరిలోకి దింపి, రాధాకు త్వరలోనే ఎమ్మెల్సీ లేదా ప్రభుత్వంలో సముచిత కార్పొరేషన్ పదవి ఇచ్చే ప్రత్యామ్నాయ ప్రతిపాదనలపై కూడా చర్చ జరుగుతోందని టాక్. ఒకవేళ చంద్రబాబు ప్రతిపాదనకు రాధా గ్రీన్ సిగ్నల్ ఇస్తే పోటీ ఖాయమని అనుకోవచ్చు

# స్వర్ణభారత్ ట్రస్ట్ రజతోత్సవాలకు ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్

**సెప్టెంబర్ 7వ తేదీ ఉదయం నెల్లూరు స్వర్ణభారత్ ట్రస్ట్ లో కార్యక్రమం**

**హాజరు కానున్న పలు రంగాలకు చెందిన ప్రముఖులు**

నెల్లూరు, 5 సెప్టెంబర్ స్వర్ణభారత్ ట్రస్ట్, వెంకటాచలం (నెల్లూరు చాప్టర్) రజతోత్సవాలకు సిద్ధమైంది. సెప్టెంబర్ 7వ తేదీ ఉదయం 11 గంటల నుంచి జరగనున్న ఈ కార్యక్రమానికి ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్య నాథ్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు వెంకటాచలం చేరుకోనున్న యోగి ఆదిత్య నాథ్ , 11.30 గంటలకు అక్షర విద్యాలయం ప్రాంగణంలో ఉన్న సోమా నైపుణ్య కేంద్రాన్ని సందర్శిస్తారు. అనంతరం 12.00 గంటలకు అక్షర విద్యాలయాన్ని సందర్శించి, విద్యార్థులతో ముచ్చటించనున్నారు. అనంతరం 2.00 గంటలకు స్వర్ణభారత్ ట్రస్ట్ కు చేరుకుని రజతోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించనున్నారు.భారతదేశ గౌరవ పూర్వ ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు గారి మానసపుత్రికగా 25 ఏళ్ళ క్రితం ప్రభవించిన స్వర్ణభారత్ ట్రస్ట్ లక్షలాది మంది పేదలు, మహిళలు, రైతులు, గ్రామీణ యువత జీవితాల్లో వెలుగులు నింపింది. నైపుణ్యాభివృద్ధి ద్వారా వారి సాధికారికతకు బాటలు వేసింది. ముచ్చింతల్ (హైదరాబాద్ చాప్టర్, ఆత్కూర్ (విజయవాడ చాప్టర్) ద్వారా సేవలను విస్తరిస్తూ... దేశవ్యాప్తంగా ఎంతో మంది యువతకు ఉచిత వసతితో పాటు నైపుణ్య శిక్షణను అందించి వారు తమ కాళ్ళమీద నిలబడేలా చొరవ తీసుకుంది. సంపూర్ణ గ్రామీణ సాధికారత సాధనలో 25 ఏళ్ళ సేవా వసంతాలను పూర్తి చేసుకున్న స్వర్ణ భారత్ ట్రస్ట్... సెప్టెంబర్ 7, సోమవారం మధ్యాహ్నం 2.00 గంటల నుంచి నెల్లూరు వెంకటాచలం స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రజామందిరంలో జరగనున్న ఈ కార్యక్రమానికి ప్రజలందరినీ సాదరంగా ఆహ్వానిస్తోంది.ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తో పాటు... స్వర్ణభారత్ ట్రస్ట్ స్ఫూర్తి ప్రదాత, పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంత్రి పొంగూరు నారాయణ, శాసనసభ సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి... తదితర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని స్వర్ణభారత్ ట్రస్ట్ నిర్వహణా బృందం తెలియజేసింది.

# వ్యాపారాలు జోరందుకున్నా ఎస్‌జీఎస్టీ ఎందుకు పడిపోయింది

విజయవాడ, సెప్టెంబర్ 5, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం మారిన తర్వాత పరిశ్రమలు వస్తున్నాయని, నిర్మాణ రంగానికి ఊపొచ్చిందని, వ్యాపార లావాదేవీలు క్రమంగా పుంజుకుంటున్నాయని అధికార వర్గాలు చెబుతున్న తరుణంలో.. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ , కేంద్ర జీఎస్టీ పోర్టల్ విడుదల చేసిన తాజా గణాంకాలు ప్రభుత్వానికి ఊహించని షాక్ ఇచ్చాయి. 2025-26 ఆర్థిక సంవత్సరపు తొలి త్రైమాసికం ఏప్రిల్-జూన్లో రాష్ట్ర సొంత వస్తు సేవల పన్ను రాబడి ఏకంగా మైనస్ 7 శాతం క్షీణించింది. పన్నుల ద్వారా వచ్చే ఆదాయం గతేడాది కంటే పెరగాల్సింది పోయి, ఏకంగా నెగెటివ్ గ్రోత్‌లోకి జారిపోవడం ఆర్థిక నిపుణులను, ప్రభుత్వ వర్గాలను విస్మయానికి గురిచేస్తోంది.మార్కెట్‌లో కనిపిస్తున్న సందడికి, ప్రభుత్వ ఖజానాకు చేరే నికర రాబడికి మధ్య ఎందుకు ఇంత భారీ అంతరం ఏర్పడిందనేదే ఇప్పుడు ప్రధాన ప్రశ్న. ఒకవైపు నిర్మాణ పనులు వేగం పుంజుకోవడం, ఇసుక పాలసీ మార్పులు, వ్యాపారాల్లో కొనుగోళ్లు మెరుగైనట్లు క్షేత్రస్థాయిలో కనిపిస్తున్నప్పటికీ.. పన్నుల లెక్కల్లో ఆ గ్రోత్ కనిపించకపోవడం వెనుక ప్రధానంగా సాంకేతిక, ప్రక్రియపరమైన లొసుగులు ఉన్నాయని చెబుతున్నారు. వ్యాపారాలు జరిగినంత మాత్రాన పన్నులు వెంటనే ప్రభుత్వ ఖాతాలోకి జమ కావు. ముఖ్యంగా వర్తకులు గతంలో నిలిచిపోయిన పెద్దమొత్తం ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ క్లెయిమ్ చేసుకోవడం వల్ల ప్రస్తుత త్రైమాసికంలో చెల్లించాల్సిన నికర నగదు పన్ను నామమాత్రంగా మారిపోయింది.మరో ప్రధాన కారణం ఐజీఎస్టీ సెటిల్‌మెంట్లలో జరిగిన తీవ్రమైన జాప్యం. ఏపీ ప్రధానంగా ఇతర రాష్ట్రాల నుంచి సరుకులను ఎక్కువగా దిగుమతి చేసుకునే వినియోగ ఆధారిత రాష్ట్రం. పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే వస్తువులపై కేంద్రం వసూలు చేసే ఐజీఎస్టీ నిధులను రాష్ట్రాలకు క్రమం తప్పకుండా సెటిల్ చేయాల్సి ఉంటుంది. అయితే ఈ తొలి త్రైమాసికంలో కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన ఐజీఎస్టీ సెటిల్‌మెంట్లు సమయానికి కాగ్ ఖాతాల్లో సర్దుబాటు కాకపోవడం వల్ల, కాగితాలపై రాష్ట్ర సొంత ఎస్‌జీఎస్టీ వసూళు తక్కువగా రికార్డయ్యాయి. వస్తువుల వినియోగం పెరిగినా, కేంద్ర సెటిల్‌మెంట్లలో జాప్యం జరిగితే ఆ ప్రభావం నేరుగా రాష్ట్ర లెక్కల్లో పతనంగా కనిపిస్తుంది. పొరుగు రాష్ట్రాలతో పోల్చినప్పుడు ఈ తేడా మరింత స్పష్టంగా, ఆందోళనకరంగా బయటపడుతోంది. పక్కనే ఉన్న తెలంగాణలో తొలి త్రైమాసికంలో ఎస్‌జీఎస్టీ వృద్ధి ఏకంగా ప్లస్ 16 శాతంగా నమోదు కాగా, కర్ణాటక , కేరళ , మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు రెండంకెల స్థాయిలో పన్ను రాబడిని పెంచుకున్నాయి. ఒకే దేశం, ఒకే రకమైన జీఎస్టీ చట్టాలు ఉన్నప్పటికీ తమిళనాడు , రాజస్థాన్ , ఒడిశాలతో పాటు ఏపీ కూడా మైనస్ గ్రోత్‌లోకి పడిపోవడం చూస్తే.. ఇతర రాష్ట్రాలు తమ తయారీ, సేవా రంగాల నుంచి నగదు రూపేణా పన్ను రాబడిని రాబట్టుకుంటున్న వేళ, ఏపీ మాత్రం పన్ను వసూళ్ల వ్యవస్థలో లీకేజీలు, రిటర్న్ల పరిశీలనలో వెనుకబడిపోయిందని స్పష్టమవుతోంది.దీనికి తోడు క్షేత్రస్థాయిలో వ్యాపారాలు జరుగుతున్నా.. అవి పన్ను నెట్‌వర్క్‌లోకి పూర్తిగా రాని అసంఘటిత లావాదేవీలుగానే మిగిలిపోతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. రిటైల్ మార్కెట్లో చాలావరకు బిల్లులు లేకుండా జరిగే అమ్మకాలు, చెక్‌పోస్టులు లేకపోవడం వల్ల ఇతర రాష్ట్రాల నుంచి పన్ను ఎగవేసి వచ్చే అక్రమ సరుకు రవాణాను కట్టడి చేయడంలో వాణిజ్య పన్నుల శాఖ తగినంత దూకుడు ప్రదర్శించలేకపోతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం కొత్త ప్రాజెక్టులు, పెట్టుబడుల ఒప్పందాలు చేసుకుంటున్నప్పటికీ, అవి పూర్తిస్థాయిలో ఉత్పత్తి దశకు వచ్చి పన్నులు సమకూరేందుకు కొంత సమయం పడుతుందన్నది వాస్తవమే అయినా, ఇప్పటికే ఉన్న మార్కెట్ నుంచి రావాల్సిన పన్నులు జారిపోవడం యంత్రాంగ లోపమేనని చెప్పాలి. ఈ మైనస్ 7 శాతం పతనం రాబోయే బడ్జెట్ నిర్వహణపై, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై తీవ్ర ఒత్తిడి తెచ్చే ప్రమాదం ఉంది. ఉచిత పథకాలు, సూపర్ సిక్స్ హామీలకు వేల కోట్ల రూపాయల నిధులు అవసరమైన ప్రస్తుత పరిస్థితుల్లో.. సొంత పన్నుల రాబడే పడిపోతే అప్పులపై ఆధారపడటం మినహా మరో దారి ఉండదు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని ఐటీసీ క్లెయిమ్‌లపై క్షేత్రస్థాయి ఆడిటింగ్ నిర్వహించడం, ఐజీఎస్టీ సెటిల్‌మెంట్లను కేంద్రంతో సమన్వయం చేసుకుని త్వరితగతిన తెచ్చుకోవడం, జీఎస్టీ ఎగవేతలపై నిఘా పెంచడం వంటి చర్యలు చేపట్టకపోతే ఖజానా మరింతగా లోటులోకి జారుకోవడం ఖాయమన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

## ఇంటింటా కుష్ఠు వ్యాధి గుర్తింపు--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 05: జిల్లాలో కుష్ఠు వ్యాధి గుర్తింపు కార్యక్రమంపై వైద్యాధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. నంద్యాల ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మాతా శిశు భవనంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, జిల్లా కుష్ఠు, ఎయిడ్స్, క్షయ నివారణ అధికారి డాక్టర్ ఎం. శారదాబాయి పాల్గొని సర్వే వివరాలను వెల్లడించారు. ఈ నెల 11 నుంచి 24వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం 1,322 బృందాలను ఏర్పాటు చేశామని, ఒక్కో బృందంలో ఆశా కార్యకర్త, పురుష స్వచ్ఛంద కార్యకర్త ఉంటారని చెప్పారు. వైద్యాధికారి పర్యవేక్షణలో కుటుంబ సభ్యులందరినీ పరీక్షించి, అనుమానితులను సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలిస్తామని తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి బహుళ ఔషధ చికిత్సను ఉచితంగా పూర్తికాలం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి చర్మవ్యాధి నిపుణులు హాజరై కుష్ఠు వ్యాధిపై శిక్షణ ఇచ్చారు. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు శ్రీనివాసులు, అంకిరెడ్డి, అనిల్‌కుమార్, కాంతారావు, తేజేశ్విని, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం--





విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 5: శ్రీ రామకృష్ణ విద్యాలయం 70 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. రాష్ట్రం, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 600 మందికి పైగా పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. పద్మావతి నగర్ ఇండోర్ స్టేడియం నుంచి ఉపాధ్యాయులను గురువందన రథంపై కూర్చోబెట్టి పూర్వ విద్యార్థులు తాళ్లతో రథాన్ని లాగుతూ మేళతాళాలతో పాఠశాల వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులకు పూర్ణకుంభ స్వాగతం పలికి శాలువాలు, పూలమాలలు, జ్ఞాపికలు, బహుమతులతో ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు పాఠశాలలోని తమ జ్ఞాపకాలను నెమరువేసుకుని, గురువులను కలిసి ఆశీస్సులు పొందారు. పాఠశాల కరస్పాండెంట్ నివర్తి మోహన్ మాట్లాడుతూ 1956లో నివర్తి వెంకటసుబ్బయ్య స్థాపించిన పాఠశాల ఒకప్పుడు ఉత్తమ ఫలితాలు సాధించిందని తెలిపారు. ప్రస్తుతం ఉపాధ్యాయ పోస్టుల కొరత, ప్రైవేటు పాఠశాలల ప్రభావంతో విద్యార్థుల సంఖ్య తగ్గిందన్నారు. పూర్వ విద్యార్థులు డాక్టర్ రవికృష్ణ, శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాల పూర్వ వైభవానికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత, ప్రస్తుత ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## నంద్యాలలో వార్డుల పునర్విభజన-

### సరిహద్దులపై ప్రజల అభిప్రాయాల స్వీకరణ--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 5: నంద్యాల పురపాలక సంఘంలో వార్డుల పునర్విభజనకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఉన్న 42 వార్డులను 52 వార్డులుగా పునర్విభజించే ప్రక్రియ ప్రారంభమైంది. ఈ మేరకు ప్రతిపాదిత వార్డుల సరిహద్దుల వివరాలను శనివారం నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో విడుదల చేశారు. ప్రతిపాదిత వార్డుల సరిహద్దులపై ప్రజల నుంచి సలహాలు, సూచనలు, అభ్యంతరాలను సెప్టెంబర్ 5 నుంచి 11వ తేదీ వరకు స్వీకరించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. ప్రజలు తమ అభ్యంతరాలను సంబంధిత ఆధారాలతో మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో లిఖితపూర్వకంగా సమర్పించాలని కోరారు. వార్డుల సరిహద్దుల వివరాలను జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్, సబ్‌రిజిస్ట్రార్, ఎంపీడీవో కార్యాలయాలతో పాటు హెడ్ పోస్టాఫీసు, నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రజల నుంచి వచ్చే అభిప్రాయాలు, అభ్యంతరాలను నిబంధనల మేరకు పరిశీలించి తదుపరి చర్యలు చేపడతామని కమిషనర్ పేర్కొన్నారు.



## ఉపాధ్యాయులదే కీలక పాత్ర--

### విద్యతోనే ఉన్నతి మంత్రి ఫరూక్--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 05: విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంత్రి ఫరూక్, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పాల్గొని ఉత్తమ సేవలు అందించిన 45 మంది ఉపాధ్యాయులను సత్కరించి అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థుల్లో జ్ఞానం, క్రమశిక్షణ, నైతిక విలువలు, ఆత్మవిశ్వాసం పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని అన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేసి విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయాలని కోరారు.




జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే శిల్పులని అన్నారు. ప్రతి విద్యార్థిపై సమాన శ్రద్ధ చూపాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో నంద్యాల జిల్లా ర్యాంకును మరింత మెరుగుపరిచేందుకు విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని తెలిపారు. విద్యార్థులను కేవలం వైద్య, ఇంజనీరింగ్ రంగాలకే పరిమితం చేయకుండా పోటీ పరీక్షలు, ఉన్నత విద్య, పరిశోధన, శాస్త్ర సాంకేతిక రంగాల్లోని అవకాశాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డీఈఓ పి. జనార్దన్ రెడ్డి, డీఐఈఓ శంకర్ నాయక్, ఉపాధ్యాయులు, పురస్కార గ్రహీతలు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## నిత్యం లీకులే.. మున్సిపల్ పైపుల దుస్థితి--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 05-:

నంద్యాల పట్టణంలో మున్సిపల్ తాగునీటి పైపుల లీకేజీలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీ ఏటీఎం సమీపంలో మున్సిపల్ పైపు పగిలిపోవడంతో తాగునీరు రోడ్డుపైకి చేరి వృథాగా పారుతోంది. దీంతో రహదారిపై నీరు నిలిచి వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు. పట్టణంలో ప్రతిరోజూ ఏదో ఒక ప్రాంతంలో తాగునీటి పైపులు పగిలి నీరు వృథాగా పోతున్నా మున్సిపల్ అధికారులు శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించడం లేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. పైపుల లీకేజీల కారణంగా విలువైన తాగునీరు వృథా కావడంతో పాటు రోడ్లపై నీరు నిలిచి పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొంటున్నారు. పగిలిన పైపులకు తక్షణమే మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని, పట్టణవ్యాప్తంగా పైపుల లీకేజీలను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

## భావి తరాల నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

**ఉపాధ్యాయుల పాత్ర సమాజ నిర్మాణంలో అత్యంత కీలకం**

**సాంకేతికతకు అనుగుణంగా నైపుణ్యాలను పెంచుకుని విద్యార్థులను తీర్చిదిద్దాలి**

**కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు**

**విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం**

**విద్యార్థుల బలాలు, బలహీనతలను గుర్తించి తగిన మార్గనిర్దేశం చేయాలి :**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి**

కర్నూలు, సెప్టెంబర్ 05:భావి తరాల నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం అని, ఉపాధ్యాయులు సాంకేతికంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు పెంపొందించుకుని, విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు కోరారు. శనివారం డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని గురుపూజోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్యాశాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల కార్యక్రమంలో కర్నూలు ఎం.పి బస్తిపాటి నాగరాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ...తాను కూడా ఎం.ఎస్‌సి. పూర్తి చేసిన అనంతరం కాంట్రాక్ట్ లెక్చరర్‌గా ఉపాధ్యాయ వృత్తితోనే తన ప్రస్థానాన్ని ప్రారంభించానని ఎంపీ తెలిపారు. విద్యార్థులను ప్రతిరోజూ మేల్కొలుపుతూ, వారి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలు అమోఘమని కొనియాడారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి జన్మదినాన్ని పురస్కరించుకుని గురుపూజోత్సవాన్ని నిర్వహించడం ద్వారా దేశానికి మార్గనిర్దేశం చేస్తున్న గురువుల సేవలను స్మరించుకునే అవకాశం లభిస్తోందన్నారు. విద్యార్థులు ఇంటికంటే ఎక్కువ సమయం పాఠశాలలో గడుపుతున్నందున వారి విద్యాభివృద్ధితో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసంపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. "ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే మహత్తర బాధ్యత గురువులపై ఉంది. వారికి నాణ్యమైన విద్యను అందించడం ద్వారా భావి తరాల అభివృద్ధికి బలమైన పునాది వేయాలి" అని ఎంపీ పేర్కొన్నారు. ప్రస్తుత సాంకేతిక యుగంలో విద్యాబోధనలోనూ మార్పులు అవసరమని, కొత్త సాంకేతికతను అందిపుచ్చుకుని విద్యార్థులకు భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన విద్యను అందించాలని కోరారు. ఉపాధ్యాయులు తమ వృత్తికి న్యాయం చేస్తూ విద్యార్థులను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. జిల్లాలో అక్షరాస్యత శాతం మెరుగుపరచడంతో పాటు విద్యా రంగంలో సమగ్ర అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, విద్యా రంగ అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం అండగా ఉంటుందని, విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు సహకరించాలని కోరారు. రాబోయే రోజుల్లో సాంకేతికతకు అనుగుణంగా విద్యాబోధనలో అవసరమైన మార్పులు చేసుకుంటూ, విద్యార్థులను భావి సవాళ్లను ఎదుర్కొనేలా తీర్చిదిద్దాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. విద్యార్థులకు జ్ఞానంతో పాటు మానవీయ విలువలను అందించాలిఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు జ్ఞానాన్ని అందించడం ఎంతో గొప్పదైన, పుణ్యప్రదమైన బాధ్యత అని పేర్కొన్నారు. సమాజ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించడంతో పాటు వారి ప్రవర్తన, ఆలోచనా విధానం, వ్యక్తిత్వ వికాసంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. విద్యార్థులు తల్లిదండ్రుల కంటే ఎక్కువ సమయాన్ని పాఠశాలల్లో, ఉపాధ్యాయుల సమక్షంలో గడుపుతున్నందున వారి భావోద్వేగ, మానసిక అవసరాలను కూడా ఉపాధ్యాయులు గుర్తించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. విద్యార్థులలోని బలాలు, బలహీనతలను గుర్తించి, అవసరమైన సమయంలో తగిన మార్గనిర్దేశం, మానసిక మరియు భావోద్వేగ సహకారం అందించాలని తెలిపారు. ఉపాధ్యాయుల ప్రోత్సాహం, సానుకూలమైన మార్గనిర్దేశం విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని పెంచడంతో పాటు వారు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు.


## బలిజ విద్యార్థులకు స్కాలర్‌షిప్--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 05-: రాయల అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (రోపా) ఆధ్వర్యంలో, గుంటూరు శ్రీ తులసి సీడ్స్ అధినేత శ్రీ రామచంద్ర ప్రభు సహకారంతో 18 ఏళ్లుగా బలిజ పేద మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ విద్యా సంవత్సరానికి స్కాలర్‌షిప్ కోసం బలిజ మెరిట్ పేద విద్యార్థులు సెప్టెంబర్ 15లోగా దరఖాస్తులు అందజేయాలి. గత సంవత్సరం స్కాలర్‌షిప్ పొందిన విద్యార్థులు పునరుద్ధరణ కోసం ఫారం బి, నూతనంగా దరఖాస్తు చేసుకునేవారు సంబంధిత ఫారం పూర్తి చేసి రోపా సభ్యులకు అందజేయాలని కోరారు. దరఖాస్తులను పసుపులేటి జనార్దన్ 9440420389, చెన్నంశెట్టి శ్రీనివాసులు 9885763763, కామిని మల్లికార్జున్ 9246279444 నంబర్లలో సంప్రదించి అందజేయవచ్చని తెలిపారు.

## 52 వార్డుల్లో అభ్యర్థుల ఎంపికకు గోళ్ళ రాజేష్ సన్నాహాలు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 5: నంద్యాల మున్సిపాలిటీలో కొత్తగా ఏర్పడిన 52 వార్డుల స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కౌన్సిలర్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను ప్రారంభించినట్లు సామాజికవేత్త, వ్యాపారవేత్త గోళ్ళ రాజేష్ తెలిపారు. ప్రజా సమస్యలపై నిబద్ధతతో పనిచేసే, వార్డుల అభివృద్ధికి కట్టుబడి ఉండే అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే పలు సేవా



కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, ఆర్థిక సహాయాలు, దేవాలయాలు, మసీదులు, చర్చిలకు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో చైర్‌పర్సన్ అభ్యర్థిగా నూర్ భాషా పేరును ప్రకటించారు. అలాగే పలు వార్డులకు కౌన్సిలర్ అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేశారు. మిగిలిన వార్డుల అభ్యర్థుల పేర్లను త్వరలో ప్రకటిస్తామని, అవసరాన్ని బట్టి జాబితాలో మార్పులు, చేర్పులు ఉంటాయని గోళ్ళ రాజేష్ కమిటీ వెల్లడించింది.

## 52 వార్డులుగా నంద్యాల--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి , సెప్టెంబర్ 5: నంద్యాల పురపాలక సంఘంలోని 42 వార్డులను 52 వార్డులుగా పునర్విభజించే ప్రక్రియ ప్రారంభమైంది. దీనిపై జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నతో శనివారం కలెక్టర్ ఛాంబర్‌లో చర్చించారు. ప్రతిపాదిత వార్డుల సరిహద్దులపై ప్రజల నుంచి సలహాలు, సూచనలు, అభ్యంతరాలను సెప్టెంబర్ 5 నుంచి 11వ తేదీ వరకు స్వీకరించనున్నట్లు



కమిషనర్ తెలిపారు. ప్రజలు తమ అభ్యంతరాలను సంబంధిత ఆధారాలతో మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో లిఖితపూర్వకంగా సమర్పించాలని కోరారు. వార్డుల సరిహద్దుల వివరాలు జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్, సబ్‌రిజిస్ట్రార్, ఎంపీడీవో కార్యాలయాలతో పాటు హెడ్ పోస్టాఫీసు, నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రజల నుంచి వచ్చే అభిప్రాయాలను నిబంధనల ప్రకారం పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

## కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

రంపచోడవరం, ఏజెన్సీ ప్రాంతంలో విద్యా వ్యాప్తికి విశేష కృషి చేస్తున్న ఉపాధ్యాయుడికి అరుదైన గౌరవం దక్కింది. దేవీపట్నం మండలం, ఇందుకూరు పంచాయతీ పరిధిలోని ఎం.రావిలంక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎంపీపీ స్కూలు ఉపాధ్యాయుడు గారపాటి శ్రీనివాస కుమార్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గురుపూజోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ చేతుల మీదుగా ఆయనకు శాలువా కప్పి, జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేసి ఘనంగా సన్మానం చేశారు. కలెక్టర్ ప్రశంసలుఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గోదావరి లంక గ్రామమైన ఎం.రావిలంక వంటి మారుమూల ప్రాంతంలో విద్యార్థుల భవిష్యత్తు కోసం అంకితభావంతో పనిచేయడం గొప్ప విషయమన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**